# సామెతలు – సందర్భాలు విశ్లేషణాత్మక పరిశీలన

**డా. హెచ్. కిషన్, రీడర్ ఇన్ తెలుగు, బద్రుక కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.**

**ప్రారంభం :** సామ్య శబ్దం నుండి ''సామెత'' పదం పుట్టింది. సామ్యం అంటే పోలిక. సామెతను హంగారీ భాషలో, పెల్డబెగెడ్, అరబ్బీ భాషలో, మతల్, హిందీ భాషలో, 'కహావత్', ఉర్దూలో 'ముహావరా', సంస్కృతంలో ''సూక్తి'' సుభాషితమని, తమిళంలో ''పళమెళి'' (పాతమాట) ఆంగ్లంలో ''ప్రొవెర్బ్'', కన్నడంలో ''గాదె'' (గాథాశబ్ద భవం) లేక నానుడి అని అంటారు. లంబాడా భాషలో ''చట్టా'' అని కూడా వ్యవహరిస్తున్నారు. అలాగే సామెతలను బంజారా భాషలో ''కావత్'' అని అంటారు. కావత్ అనే పదం ఉత్తర భారతదేశం భాషలేని హిందీ, గుజారాతీ, రాజస్థాన్ భాషల్లో పేర్కొనే ''కహావత్'' అనే పదం నుండి ఆవిర్భవించినట్లు భావిస్తున్నారు. సామెతలు లేదా ''కావట్'' లు బంజారాల జీవనంలోని వివిధ సందర్భాలతో సమ్మిళితమై ఉంటాయి. సామెతలు, లోకోక్తులు, సూక్తులు, ఆమెతలు, నుడిపలుకు - ఇలా వివిధ పేర్లతో వ్యవహరించడం, ఏదో మాట చెప్పినట్లు లేక ఏదో సామెత చెప్పినట్లు అంటూ లోకంలో బహుళ ప్రచారంలో ఉన్న అంశం. సామెతలు సందర్భాలకు ఒక చుట్టరికం ఉంది. సందర్భావసరాన్ని బట్టి ఒక్కోసారి కొత్త సామెత కూడా పుట్టవచ్చు. అలాగే గుర్తించవలసిన విషయం ఏమిటంటే పొడుపు కథలు, సామెతలు కావు ఇవి ధర్మమార్గాన్ని సూచించే పాదసూచికల వంటివి.

**అనుభవం :** సామెతలు ఎంతో అనుభవసారంగా సాగుతాయి. అనేక సందర్భాలలో ఏదైనా విషయాన్ని ముక్కుసూటిగా కొట్టవచ్చినట్టు, వివరంగా సంక్షిప్తంగా అర్థం ఉండే విధంగా చెప్పేదే సామెత. మానవ జీవితానుభవంలో కాచివడపోసిన సత్యాలే, సామెతలై జనవ్యవహారంలో జీవిస్తూ వస్తున్నాయి. సూత్రప్రాయమైన నీతులకు ఆచారాల రీతులకు, విశ్వాసాలకు నమ్మకాలకు మానవ జీవన విధానాలకు అనుభవాలకు సామెతలు అద్దంపడతాయి. వివిధ సందర్భాలలో ప్రతిరోజు మనం నిత్యజీవితంలో ఎన్నో సామెతలు వింటూ ఉంటాము. ఆ విన్నవీ మన జీవితంలో అనుభవించినవీ సామెతల రూపంలో వెలువడుతూ ఉంటాయి. ఈ సామెతలు కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సాగుతాయి. అన్ని తెగల్లో కోకొల్లలుగా ఉన్నాయి. అందులో కొన్ని సామెతలను తీసుకొని వాటిలోని అంతరార్థాన్ని తెలుపుతూ, ఆమెతగా సాహిత్య సౌరభాన్ని అందించడం ఈ వ్యాసం ఉద్దేశం.

**సామెతలు సందర్భాలు : 'సామెత లేని మాట - ఆమెత లేని ఇల్లు'** అనేది కూడా ఒక సామెత. ఇది మన భాషలోని సొగసును. మనవారి గృహధర్మాన్ని తెలుపుతుంది. ఆమెత అంటే విందు. శరీర సుఖాన్నిస్తుంది. సామెత మనసుకు ఆనందాన్ని అందిస్తుంది. శరీర సుఖం భౌతికంగా తాత్కాలికం. ఆనందం, శాశ్వతం, మనో సంబంధితం. ఆనందమే బ్రహ్మ స్వరూపం. అని ఉపనిషత్తులు కూడా చెబుతాయి. కనుక సామెతలకు పూర్వ రూపం లేదా ధర్మమే. శరీరానికి బలం ఉంటే మనస్సు మరికొంత చమత్కారంగా పని చేస్తుంది. ఆ చమత్కార ఫలితమే భాషలోని సౌందర్యావిష్కరణ రూపమైన సామెత. ఆనందోపలబ్ధి సామెత పుట్టుకకు మూలకారణం గాలికీ, నీటికి ఈ రెండింటికి వ్యాప్తి ఉంది. వాటిని ఒక దగ్గర చేయాలి. దానికి నేర్పు ఉండాలి. అప్పుడే దానిని సామెత అని పిలుస్తారు.

మానవుడు సంఘజీవి. ఎడతెగని ఈ అనంత యాత్రలో తనకు గల అనుభవం, విజ్ఞానం తను పొందిన కష్ట సుఖాలను లోకంలోనున్న రీతిని చిన్న మాటతో కుదించి మళ్ళీ సంఘానికే ఒదిలినాడు. సామెతలు రూపాయి లాంటివి. ప్రభుత్వం ముద్రించి తయారుచేసిన రూపాయి ఏ విధంగా అవసరానికి ఒకరి నుండి మరొకరికి చలామణి అయి తమ అవసరాలను తీర్చుతున్నదో అలాగే సామెతలు కూడా

అనేక సందర్భాలలో సమాజంలో ఒకరి నోటి నుండి మరొకరికి చలామణి అవుతాయి. ఒక వ్యక్తి తన అనుభవంతో ఎక్కడో ఎదో సందర్భాల్లో చెప్పిన సామెతను ఆ విన్న వ్యక్తి మరొక చోట సందర్భాన్ని బట్టి వాడుతూ వస్తున్నారు.

**'ఆముదాల బేరం - కామెర్ల రోగం నమ్మరాదు'** అనే సామెత ఆముదాల ధర ఎప్పుడు పడిపోతుందో తెలియదు. ఎప్పుడు పెరుగుతుందో తెలియదు. షేర్ మార్కెట్‌లాగా, అనగా షేర్ మార్కెట్‌లో పెట్టిన పెట్టుబడి డబ్బులు పెరిగేదిగాని, తగ్గేదిగాని తెలియదు. లాభం రావచ్చు, నష్టం రావచ్చు. లాభం వస్తే ఆనందానికి అవదులు ఉండవు. నష్టం వస్తే బాధపడతారు. కొన్ని సందర్భాలలో అత్యాశలో షేర్‌మార్కెట్‌లో ఎక్కువ డబ్బులు పెట్టి నష్టపోయి ఆత్మహత్యలు చేసుకొని చనిపోయిన వాళ్ళు కూడా ఉన్నారు. పెట్టిన పెట్టుబడి రెండింతలు పెరిగి కోటీశ్వరుడైన వాళ్ళు కూడా ఉన్నారు. అట్లే కామెర్ల రోగం మనిషి శరీరంలో లోలోపల పెరిగి అది ఒకే సారి అకస్మాత్తుగా బయటపడుతుంది. అది తెలియక తెలుసుకోలేక నిర్లక్ష్యం చేసి ప్రాణం మీదికి తెచ్చుకోవడం తగదని హెచ్చరిస్తాడు మానవతావాది పై సామెతలో.

**"అన్నేసి చూడు - నన్నేసి చూడు"** అనే సామెత భోజనం చేసేటప్పుడు చప్పున రుచి ఉప్పు లేదని తెలుస్తుంది. ఎంతో డబ్బులు ఖర్చు చేసి రుచికి కావలసిన సామాన్లు తీసుకొచ్చి వేసి వండిన కూర అన్నం తింటే నోటికి రుచి కలిగించదు. తిన బుద్ధికాదు. ఎందుకనగా అందులో సరిపోను చౌకగా లభించే ఉప్పు లేదు. కాబట్టి వెంటనే దానికి సరిపోను ఉప్పు వేసి కలిపినట్లైతే అది రుచిగా ఉంటుంది. కడుపునిండ తినగలరని పై సామెత ద్వారా తెలుస్తుంది.

**"అంకె లేని కోతి - లంకంతా చెరచిందట"** అనే సామెత చిన్న పిల్లలు తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినకుండ ఇంట్లోని వస్తువుల్ని చిందర వందర చేసి పగలగొట్టడం నాశనం చేస్తున్నప్పుడు ఇరుగు పొరుగు వాళ్ళు బంధువులు ఇలా అనడం సర్వ సాధారణం. దీని వెనుక సీతా సందర్శనానంతరం హనుమంతుడు వెళ్ళి సీత యోగక్షేమాలు అడిగి తెలుసుకొని లంకలో అశోక వనాన్ని పాడుచేయడం లంకను కాల్చడం మొదలైన సంఘటనలున్నాయి. పై సామెతలో ఉన్న అంతరార్థం.

**"పెళ్ళి చేసి చూడు - ఇల్లు కట్టి చూడు"** అనే సామెత కూతురి పెళ్ళి చేయబోయే తండ్రి యొక్క బాధను కష్టాన్ని తెలియజేస్తుంది. పెళ్ళి చేయడం, ఇల్లు కట్టడం ఇవి రెండు సమానమే. ఎందుకంటే పెళ్ళికి అయ్యే ఖర్చు అనుకున్న దానికంటే ఎక్కువ అవుతుంది. ఆర్థిక భారం పైన పడుతుంది. ఇల్లు కట్టాలన్న దాని ఖర్చు కూడ అనుకున్న దానికంటే అధికమౌతుంది. కూతురి పెళ్ళి చేయబోయే తల్లిదండ్రులు పడే ఆరాటాన్ని, ఇల్లు కట్టించే తల్లిదండ్రులు పడే ఆరాటాన్ని ఈ రెండింటిని ఈ సామెత గుర్తు చేస్తుంది. అందుకే లోక అనుభవం కలిగిన పెద్ద వాళ్ళు పెళ్ళైనా అమ్మాయి ఇంటిలో ఆరు నెలలు కరువు ఉంటుందని అన్నారు. అంతేగాక ఇల్లుపైన పెట్టిన ఖర్చు కూడా లెక్కకు రాదని చెబుతారు.

నిజం చెప్పాలంటే **"ఆడదాని బ్రతుకు అరిటాకు"** వంటిదని అంటారు. ఎందుకంటే అరిటాకు మీద ముల్లు పడ్డా, ముల్లు మీద అరిటాకు పడ్డా ఆమెకే నష్టం. ఎందుకంటే పెళ్ళికాని అమ్మాయి కాలుజారితే కన్న తల్లిదండ్రులకు వారి కుటుంబాలకు చాల అవమానం. బయట తిరగడానికి ఎవరితోనైనా మాట్లాడడానికి, అటు బంధువులలో గాని, తమ నివాసముంటున్నా పల్లెల్లోగాని సిగ్గుచేటని భావించుకొని బాధపడుతుంటారనే విషయం అందరికి తెలిసిందే. అంతేకాకుండా లోకంలో ఆ కన్నెపిల్లను చిన్న చూపుతో చూస్తారు. పెళ్లి చేయాలన్నా కష్టమే. ఎవ్వరు ముందుకురారు. తల్లితండ్రులు జన్మనిచ్చారు కాబట్టి తలచుకుంటూ దుఃఖిస్తుంటారు. ప్రత్యేకంగా అమ్మాయిలు కళాశాలలకు, బయట అవసరాలకుగాని, ఉద్యోగపరంగా గాని వెళ్ళిన తన పరిధిలో జాగ్రత్తగా ఉండాలని తెలియజేయడానికి పై సామెత పుట్టిందని చెప్పవచ్చు.

**"నోరు మంచిదైతే - ఊరంతా మంచిదే"** అనే సామెత ఎవరైనా వినయంగా సభ్యతగా, సంస్కారంగా, మర్యాద ఇచ్చి మాట్లాడటం. నోరు మంచిదవటం అనగా మంచి ప్రవర్తనతో తెలియని విషయాలను విధేయతతో ఎదుటి వ్యక్తిని నొప్పించకుండ అడిగి తెలుసుకోవడం అలా మాట్లాడితే, ఊళ్ళో నివసిస్తున్న వ్యక్తి మనవాడే ఊరు అంటే చుట్టూ ఉన్న సమాజం సమాజంలోని ప్రతి ఒక్కరూ సభ్యత, సంస్కారం కలిగి ఉంటే మొత్తం సమాజమే సభ్య సమాజం అవుతుంది. సమాజ శాస్త్రంలోని మూలసూత్రం ఈ సామెత ! దీనిని అప్పుడప్పుడు గుర్తు చేసుకోవడం కన్నా గుండెల్లోని ప్రాణవాయువు లాగ, మనస్సులో ప్రతిష్ఠించుకుంటే ఉత్తమం. రాజ్యం చేయడానికి, తిరిగి రాముడు దిగి రానక్కరలేదు. ఎవర్ని నొప్పించకుండా అసత్యం మాట్లాడకుండా, ఎవ్వరికి అన్యాయం చేయకుండా, ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా ఉన్న వ్యక్తి ఊరిలోనే అందరి మనస్సులో, హృదయంలో ఉండిపోతారు. అదృష్టం తక్కువై అనారోగ్యం పాలై, చనిపోతే ఆ ఊరిలోనున్న వాళ్ళే కాకుండా చుట్టూ ప్రక్కల ఊర్ల వాళ్ళు కూడ బాధపడతారు. ఎప్పుడు మరచిపోరు అందుకే ఈ వ్యవహార ప్రయోజనానికి మూలమైన సాధనం వాక్కు. వాక్కుకున్న పదను వాడి కత్తికి లేదు, మార్చగలదు మాట మనిషి మనసు, జారవలదు నోరు జాగ్రత్త, శబ్దాలకు గొప్ప శక్తి ఉంది. మాటకున్న శక్తి కత్తికి లేదు. మాట మనిషి మనసును మారుస్తుంది. మనం మాట్లాడే మాటలే మనకు మనుషులను శాశ్వతంగా దూరం చేస్తాయి. మనం మాట్లాడే మాటలు చాల జాగ్రత్తగా మాట్లాడాలి. ఎందుకంటే మన నోటి ద్వారా వచ్చే శబ్దాలకు చాల శక్తి ఉంటుంది. జిహ్వాగ్రం పై సరస్వతి కొలువై ఉంటుంది. మనకు వాచకం, శబ్దం వస్తున్నాయి. ఆ సరస్వతిని ఆరాధించే వారికి ప్రియభాషణం అబ్బుతుంది. నోటి వెంట వెలువడే ప్రతి మాటకు అర్థం ఉంటుంది. ఆ మాటకు గౌరవం, విలువ రెండు ఉంటాయి. డబ్బుపోతే తిరిగి సంపాదించుకోవచ్చు, నోటివెంట మాట జారితే మళ్ళీ రాదని కాబట్టి నోటి మాట జాగ్రత్త అని పై సామెత తెలియజేస్తుంది.

**"రశీదు తప్పితే మసీదు"** అనే సామెత అప్పు తీసుకొనే విషయంలో గాని, భూమి కొనుగోలు విషయంలోగాని, ఇల్లు కొనుగోలు విషయంలోగాని, లేదా ఏదైనా వస్తువులు కొనుగోలు విషయంలో గాని తప్పని సరిగా కాగితం ఇరువురి పెద్దమనషుల సమక్షంలో ఒప్పందం అనగా అగ్రిమెంటు రాసుకుంటే బాగుంటుంది. ఆ అగ్రిమెంటు పత్రంపైన ఇద్దరి తరపున పెద్ద మనషుల సంతకాలు తీసుకోవాలి. ఆ పత్రాన్ని చాల భద్రంగా దాచిపెట్టుకోవాలి. ఎందుకంటే కలియుగంలో అధర్మం నడుస్తుంది. ఇద్దరి మధ్య గొడవలు వస్తే ఆ రాసుకున్న అగ్రిమెంటు పత్రం ఆ పత్రంలో సంతకాలు పెట్టిన పెద్ద మనషులే సాక్ష్యం లేదా అదృష్టం తక్కువై రాసుకున్న అగ్రిమెంటు పత్రం రశీదు ఎక్కడైన పోతే చాల ఇబ్బంది పడవల్సి వస్తుంది. లేకుంటే తప్పని పరిస్థితిలో ఏదైన దేవత గుడిలో లేదా తన కన్న పిల్లల మీద, లేదా పచ్చని ఆకు మీద ప్రమాణం చేసుకోక తప్పదు. ఇలా చేస్తేనే ఇద్దరి మధ్య వచ్చిన గొడవకు పరిష్కార మార్గం వస్తుందని పై సామెతకు అర్థం.

**"ఇంటింటికి మట్టి పొయ్యి"** అనేది సామెత వివరించుకుంటే ప్రతి కుటుంబంలో ఏదో ఒక సమస్య ఉంటుంది. బిచ్చగాడి కుటుంబం మొదలుకొని కోటీశ్వరుడి కుటుంబం వరకు ఏదో ఒక సమస్యతో బాధపడుతు ఉంటారు. అర్థిక సమస్య కావచ్చు. పిల్లల సమస్య కావచ్చు. అనారోగ్య సమస్య కావచ్చు ఏదో ఒక సమస్యతో ప్రతి కుటుంబం బాధపడుతూనే ఉంటుంది. కొంత మందివి పదవి సమస్యలు మరికొంత మందివి రాజకీయ పరిపాలనా సమస్యలు, ఉద్యోగ సమస్యలు ఇలా చెప్పుకుంటుపోతే అనేక రకాల సమస్యలతో కొన్ని కుటుంబాలు సతమతమవుతుంటాయి. ప్రతి ఇంట్లో ఏదో ఒక సమస్య ఉంటుంది. సమస్య లేని ఇల్లు లేదని చెప్పడానికి పై సామెత ఉపయోగపడుతుంది.

**"పంచాంగాలు చింపేస్తే నక్షత్రాలు పోతాయా"**. 'పంచాంగం' అంటే ఖగోళాన్ని అందులోని గోళాల నడకలని, వాటి ఫలితాలను గురించి వివరించే శాస్త్రం గ్రంథం. 'పంచ' అంటే ఐదు 'అంగం' అంటే భాగం. పంచాంగములు గలది పంచాంగం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేవి పంచాంగంలోని ప్రధానమైన ఐదు భాగాలు. చంద్రుడి కళలను లెక్క కట్టేది తిథి. ఇదే తేది, డేట్‌గా మారిందని కొందరు భాషా శాస్త్రవేత్తలు చెప్పుతున్నారు. ఇది ఒకరోజు సూర్య గమనాన్ని గ్రహాల

అనుసంధానాన్ని బట్టి గ్రహించేది. గ్రహాల అనుకూల పరిస్థితులను నిర్ణయించేది యోగం. వాటి ఫలితాలను వివరించేది కరణం. మనం ఔనన్నా, కాదన్నా అది శాస్త్రం, శాస్త్రం నిర్ణయించిన దానిని అనుసరించడం క్షేమం. మనకి వచ్చిన రోగం తగ్గటం లేదని, వైద్యశాస్త్ర గ్రంథాలు చింపితే వైద్య శాస్త్రానికేం నష్టం లేదు. అలాగే పంచాంగం చింపితే, జ్యోతిష శాస్త్రానికేమి నష్టం లేదు. కాని శాస్త్రాన్ని నమ్ముకొని వివేకంగా బతకవలసిన మానవుడికి నష్టం. కాబట్టి ఈ విషయాన్ని సున్నితంగా మందలిస్తు చెప్పుతుంది పై సామెత.

**"ఏకానేతి సామళన్ - ఓ కానేతి కాణ్ణకే వాళ్ళు"** (బంజారా సామెత) **"ఈ చెవితో విని, ఆ చెవి నుండి తీసేస్తావు"** (తెలుగు అర్థం) మన శ్రేయస్సుకోరి, బాగోగులు కోరి ఏదైన మంచి విషయం చెప్పినప్పుడు దానిని అర్థం చేసుకొని నడచుకుంటే వారు సంతోషిస్తారు. కొన్ని సందర్భాల్లో వారు చెప్పిన మంచి మాటలను పట్టించుకోకుండా తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే వారికి కోపం వస్తుంది. చెప్పిన దానిని విని పాటించకుండా మందలిస్తే కోపం రావడం సహజం. అలాంటి వ్యక్తిని ప్రస్తావిస్తూ పలికిన సామెత తెలుగులో కూడా ప్రచారంలో ఉంది. ఈ కలియుగంలో చెప్పితే వినే వారి సంఖ్య చాల వరకు తగ్గిపోతుంది. రోజు రోజుకు అలాగే మనిషిలో అహంకారం పెరిగిపోతుంది. అహంకారం పతనానికి దారి తీస్తుంది. అర్థం చేసుకోవడం లేదు. ఒక వేళ అర్థం అయినా అర్థం కానట్లు ప్రవర్తిస్తున్నారు. మనషులలో సాధారణంగా కనిపించే వైఖరిని తెలియజేస్తున్నది పై సామెత.

**"వాతే వాళేర్ బుండావక్ఔ - బనావతే వాళేర్ ఔర్ వకేణి"** (బంజారా సామెత) **"మాటలు వచ్చినవాడు మక్కకున్నెల్ని అమ్ముతాడు - మాటలు రాని వాడు జొన్నలు కూడ అమ్మలేడు"** ( తెలుగు అర్థం) తెలివైనవాడు మొక్కజొన్న కంకి మక్కలు ఒలువగా, మిగిలిన పనికిరాని మక్క కన్నెలను ఇతరులకు అమ్ముతాడు. నేడు మనిషి అనేక రకాలుగా నష్టపోతున్నాడు. నకలి వస్తువులను తయారు చేసి అమ్ముతున్నాడు. అమెజాన్ లాంటి ఆన్‌లైన్‌లో ఒక వస్తువుకు బదులు మరొక వస్తువు రావడం జరుగుతుంది. నాడు మోసపోవడం కాదు. నేడు తెలివితో మోసపోతున్నారు. పై సామెతలో అమాయకునికి జొన్నలను కూడా అమ్మడం చేతకాదనే సత్యాన్ని బంజారాల అనుభవ పూర్వకంగా వచ్చిందని పై సామెత ద్వారా తెలుస్తుంది.

**"బ్యాడిన్ సిక్‌ధేన్ - సాసుసనారే లారగీఛ"** (బంజారా సామెత) **"అత్త నీతులు చెప్పి - అవుసుల వాని వెంట వెళ్ళింది"** (తెలుగు అర్థం) అత్త ఇంట్లో పెద్ద చాల క్రమశిక్షణతో, పద్ధతితో ఉండాలి. కుటుంబంలో అందరికి అదర్శంగా ఉండాలి. ఎలాంటి తప్పులు చేయకుండా ఉండాలి. కొత్తగా ఇంటికి వచ్చిన కోడలును అన్ని విధాల నీతులు జాగ్రత్తలు చెప్పి తను మాత్రం అవుసుల వాని వెంట వెళ్ళిపోయింది. అనగా తను తప్పు చేసిన వైనాన్ని తెలియజేస్తుంది. పై సామెత ఇది తెలుగులో కూడా ప్రచారంలో ఉంది.

**ముగింపు** : సందర్భాన్ని బట్టి వాడే సామెతలు కోకొల్లలుగా ఉన్నా ఈ వ్యాసంలో కొన్నిటిని మాత్రమే వివరించాను.

సామెతలు మనషుల మధ్య అనుబంధాలను పెంచి పోషిస్తాయి. సమాజాన్ని సవ్యమార్గంలో నడిపిస్తాయి. మానవ హృదయాలకు అద్దంపడతాయి. సారాంశాలను చింతిస్తాయి. కులాలు, వృత్తులు, ప్రవృత్తులు, గుణాలు, అలంకారాలు, రూపురేఖలు ఇలా ఏవీ సామెతల చట్టానికి అతీతం కావు.

పండుగలు, పబ్బాలు, అలావాట్లు, ఆచార వ్యవహారాలు, సంస్కారాలు, సంప్రదాయాలు, సర్వ సంఘటనలు సహజాతాలు, కళలను అన్నింటినీ తనలో ఇముడ్చుకున్న భాషామ తల్లి విశ్వరూప దర్శనం మనకు చేయించేది సామెత.

## ఆధారగ్రంథాలు


1 బుడిగె జంగాలు భాషా సాహిత్య సాంస్కృతికాంశాల పరిశీలన – డ. ఎన్.ఆర్.వెంకటేశం.

2. ఆంధ్రుల జానపద విజ్ఞానం – డా. ఆర్వి. యస్. సుందరం.

3. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం జీవన చిత్రణ – డా. సూర్యాధనంజయ్.

4. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా. ఆర్వీ. యస్. సుందరం.

5. జానపద విజ్ఞానాధ్యయనం – డా. జి.ఎస్. మోహన్. ద్రావిడ విశ్వవిద్యాలయం ముద్రణ : 2010.

6. నిత్య వైవిధ్యం: డా. వెలుదండ నిత్యానందరావు, తొలిముద్రణ, 2007.

7. తెలుగు పొడుపు కథలు – డా. కసిరెడ్డి, తొలి ముద్రణ 1990, ప్రచురణ: జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్‌శాఖ, ఆంధ్రప్రదేశ్.

8. విశ్వనాథ పావని శాస్త్రి - తెలుగు నాట సామెతలు, తొలి ముద్రణ, నవంబరు 2003.

9. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం - డా. జనపాల శంకరయ్య.